క్లుప్తంగా

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత


స్ప్రే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుస్నాబాద్: మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందితో ఇండ్ల మధ్య నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయించి స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ చుట్టూ ఉన్న ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ పెరుక భాగ్యరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రోళ్లను కలిసిన బీఆర్ఎస్ నేతలు
మర్కూక్(గజ్వేల్): మర్కూక్‌కు చెందిన బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్యను ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దీంతో ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వైద్య సదుపాయాలు, అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు పునరావాసం కల్పించాలి


దుబ్బాకలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

దుబ్బాక: వరదలతో నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పునరావసం కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు నవీన డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సహాయంగా విరాళాలు సేకరిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ వరదలకు దెబ్బతిన్న ప్రాంతాలను వెంటనే సందర్శించాలని కోరారు.

శాంతిభద్రతలను కాపాడటంలో కేంద్రం విఫలం
చేర్యాల(సిద్దిపేట): శాంతి భద్రతలను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందనడానికి మణిపూర్ ఘర్షణలే నిదర్శనమని పీసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి శుక్రవారం అన్నారు. రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు కుట్రపూరితంగా వేసిన కేసులో సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన జూడో యాత్రపై వచ్చిన స్పందన చూసి బీజేపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

జీఓ రద్దుకు డిమాండ్
జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేస్తూ విడుదల చేసిన జీఓ 81ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఓటాదారులు, ఇస్సాదారులు(వీఆర్ఏ) డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. జీఓ 81తో ఇస్సాదారులు, ఓటాదారులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వినోద్
గజ్వేల్‌రూరల్: బీఎస్పీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కేతోజి వినోద్ నియమితులయ్యారు. శుక్రవారం సిద్దిపేటలోని బీఎస్పీ కార్యాలయంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఈఆర్ మోహన్ నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాదగిరి, జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి నరేష్, నియోజకవర్గ అధ్యక్షుడు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి రమణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూల్చివేత
అక్కన్నపేట(హుస్నాబాద్): హైకోర్ట్ ఉత్తర్వులు ప్రకారం అక్కన్నపేటలో ఇళ్ల కూల్చివేత చేపట్టినట్లు ఎంపీఓ కవికుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అక్కన్నపేటకు చెందిన బుర్రబోయిన రాజు రేకులతో ఇల్లు నిర్మించుకున్నాడు. అతను నిర్మించుకున్న ఇంటి స్థలం తమదేనని బుర్రబోయిన స్వప్న హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్ట్ ఉత్తర్వులు ప్రకారం ఇల్లును కూల్చామన్నారు.

విస్తీర్ణం ఉన్నా.. అవగాహన సున్నా

- పండ్ల తోటల సాగుకు సలహాలు కరువు
- డివిజన్ కేంద్రంలో ఏర్పాటుకాని కార్యాలయాలు
- పట్టించుకోని పట్టు పరిశ్రమ, ఉద్యానశాఖ అధికారులు
- చర్యలు చేపట్టాలన్న రైతాంగం


గాంధీనగర్‌లో కొబ్బరి తోట సాగు చేస్తున్న ఎన్ఆర్ఐ మురళీధర్‌రావు

హుస్నాబాద్ రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. పండ్ల తోటలు జిల్లాలో హుస్నాబాద్ డివిజన్ పరిధిలో 9 వేల ఎకరాల విస్తీరణంలో ఉన్నాయి. వర్షాధార పంటలు సాగు చేసే రైతులు వీటిని సాగు చేయడానికి మొగ్గు చూపుతారు. ఆసక్తి ఉన్న వారికి అవగాహన కల్పించకపోవడంతో వెనుకడుగు వేస్తున్నారు. డివిజన్ కేంద్రంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమ కార్యాలయాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తే పండ్ల తోటల సాగుకు మళ్లీ అవకాశం ఉంది. మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు హాజరవుతున్నారు తప్ప డివిజన్ కేంద్రంలో కార్యాలయాలు ఏర్పాటు చేసుకోకపోవడం విశేషం.

కొత్త రకాలకు అవకాశం

గతంలో మామిడి, బత్తాయి, జామ, నిమ్మ, దానిమ్మ తదితర తోటలను సాగుచేసిన రైతులు వాటిలో ఎక్కువ లాభాలు రాక పోవడంతో కోహెడ, హుస్నాబాద్ ప్రాంతంలో మామిడి తోటలను తొలగించి వరి సాగు చేస్తున్నారు. ఇప్పుడు కొత్త రకం తోటలు, ఆపిల్ బేర్, కొబ్బరి చెట్లు, మునగ, సీతాఫలం, నేరేడు తోటల పెంపకానికి ఉపాధి హామీ పథకంలో అవకాశం కల్పించారు. సన్న, చిన్నకారు రైతులకు అవగాహన కల్పిస్తే పండ్ల తోటల విస్తీరణం పెరగడంతోపాటు విద్యుత్, సాగునీరు ఆదా అవుతుంది. మునగ, కొబ్బరి, ఆపిల్ బేర్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. డివిజన్ కేంద్రంలోని ఐఓసీ భవనంలో ఈ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేసి అధికారులను నియమిస్తే రైతులకు అందుబాటులో ఉంటారు. వీరి సలహాలు, సూచనలతో దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుంది.

పాలాల గట్లపై కొబ్బరి చెట్లు

జిల్లాలో ప్రాజెక్టులు నిర్మించడంతో సాగునీటికి లోటు లేదు. పునాస పంటలు పండించే రైతులు సైతం ఖుస్కీ భూమిలో వరి పంటలు సాగు చేస్తున్నారు. వరి పొలాలగట్లపై కొబ్బరి చెట్ల పెంపకము చేపడితే హుస్నాబాద్ ప్రాంతం మరో కోన సీమగా మారుతుంది.

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

పండ్ల తోటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందిస్తుంది. సన్న, చిన్నకారు రైతులు పండ్ల తోటలు చేసు కోవాలంటే స్థానిక ఫీల్డు అసిస్టెంట్లకు దరఖాస్తులు ఇవ్వాలి. మాకు ప్రత్యేకించి కార్యాలయలు లేవు. ఎక్కువగా ఫీల్డ్ వర్క్ చేస్తాం. దీంతో కార్యాలయాల అవసరం రాలేదు.

– రవళి, ఉద్యాన శాఖ అధికారి, హుస్నాబాద్

పండ్ల తోటల గురించి తెలియదు



నాకు రెండు ఎకరాల ఖుష్కీ భూమి రోడ్డు పక్కనే ఉంది. బోరు వేశాను. కొద్దిగా నీళ్లు వస్తే పునాస పంటలే సాగు చేస్తా. ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు సాగు చేయొచ్చనే విషయం తెలియదు. కొబ్బరి, మునగకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. అధికారులు చెబితే పొలాల గట్ల మీద కొబ్బరి మొక్కలు నాటుతా.

– పోశవేని కొమురయ్య, కిషన్‌నగర్

దర్జాగా వాగు కబ్జా!

- అది పట్టాభూమి అంటున్న కబ్జాదారుడు
- పనులను అడ్డుకున్న అధికారులు


మంజ్యానాయక్‌తండా బ్రిడ్జి వాగు భూమిని చదును చేస్తున్న దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): వాగు భూమి తన భూమే అని చెప్పుకొంటూ కబ్జాకు పాల్పడ్డాడు. వాగు భూమి తన పొలంలోకే వస్తుందని సదరు రైతు శుక్రవారం చదును చేయిస్తున్నాడు. దీంతో వాగు సగం పూడుకుపోతుంది. భారీ వర్షాలు కురిస్తే గతంలో లాగా నీరు సాఫీగా పారకపోగా పక్క పొలాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. దీంతో పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయితే వాగుకు ఇరువైపులా ప్రభుత్వ భూమి ఉంది. ప్రజల రాకపోకల కోసం మంజ్యానాయక్‌తండా సమీప వాగుపై మైసమ్మవాగుతండా–అక్కన్నపేట మండలానికి వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి పక్కనే ఉన్న 387 సర్వే నంబర్ ఉన్న పొలం రైతు వాగును కబ్జా చేస్తున్నాడు. స్పందించిన రెవెన్యూ అధికారులు పనులు అడ్డుకున్నారు. కాగా, సదరు రైతు తాను వాగు భూమిని కబ్జా చేయడం లేదని, తనకు ఉన్న పట్టా భూమి ప్రకారం భూమిని చదును చేస్తున్నానని అధికారులకు చెప్పాడు. భూ సర్వే చేసే వరకు పనులు చేపట్టరాదని తహసీల్దార్ సంజీవ్‌కుమార్ హెచ్చరించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్
- పాలకవర్గ సమావేశంలో రుణమాఫీ ప్రకటనపై హర్షం


స్వీట్లు పంచుకుంటున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు

గజ్వేల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతున్నదని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణ మాఫీ ప్రకటన రైతుకు భరోసా ఇచ్చిందని చెప్పారు. కరోనా విలయం, కేంద్ర ప్రభుత్వ సహకారం లేక రుణమాఫీకి కొంత ఆలస్యం జరిగిందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను విడుదల చేయకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్రం తీరును ప్రజల్లో ఎండగడతామన్నారు. సమావేశంలో గజ్వేల్ ఏడీఏ బాబునాయక్, సహకార సంఘం చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ మహిపాల్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం


పిల్లలకు పౌష్టికాహారం తినిపిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

వైద్యశాఖ అధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అంగన్ వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని శివాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజెప్పేందుకే తల్లిపాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, అంగన్‌వాడీ టీచర్ శ్రీమతి, ఆర్పీలు, ఏఎన్ఎంలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రపూర్ గ్రామంలో అన్నప్రాసన్న కార్యక్రమం, తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్‌లోని ప్రభుత్వాసుపత్రిలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్

గజ్వేల్‌రూరల్: పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం అమృతంతో సమానమని, ఈ పాలల్లో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గజ్వేల్‌లోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవో రాము, సీడీపీవో వెంకటరాజమ్మ, డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీలత, వైద్య సిబ్బంది నర్సింలు, వాసుదేవ్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి
జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి కిందపడి తీవ్రంగా ఓ కూలి గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మహబూబ్‌బాద్ జిల్లా చినాగూడెం గ్రామానికి చెందిన పున నవీన్(26)రెండు నెలల క్రితం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలో చేపట్టిన ఏఎంఆర్ కాళేశ్వరం కాల్వ నిర్మాణ పనులు చేసేందుకు వచ్చాడు. పని చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. కాగా అక్కడే మరో వ్యక్తి లింగయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనినిమిత్తం ట్రాక్టర్‌పై నవీన్‌తోపాటు వెళ్తున్నాడు. జగదేవ్‌పూర్ వస్తున్న క్రమంలో అక్షర పాఠశాల వద్ద ట్రాక్టర్ ఆపడంతో నవీన్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని గజ్వేల్ ప్రభుత్వాసుప్రతికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు.

చెత్త ట్రాక్టర్ అడ్డగింత
మద్దూరు(హుస్నాబాద్): ప్రైవేట్ కూలీలతో చెత్త సేకరించి పంచాయతీ ట్రాక్టర్‌లో తరలిస్తుండగా శుక్రవారం సమ్మె చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఏఎన్ఎంల అరెస్టులు సరికాదు


నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

గజ్వేల్‌రూరల్: సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడి చేపట్టిన సెకెండ్ ఏఎన్ఎంలను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. ముట్టడికి వెళ్తున్న సెకెండ్ ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ సెక్రటరీ నర్సింలు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసచారి, జిల్లా అధ్యక్షురాలు రోస్ మేరీ, ఎస్‌హెచ్ఎం రాష్ట్ర నాయకుడు శ్రీలత, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రీతమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాములు, ప్రచార కార్యదర్శి జోసెఫ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్
హుస్నాబాద్: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా రాష్ట్ర కమిటీ అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం మండల గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జేఏసీ నాయకులను పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను అణచివేసే లక్ష్యంగా ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందన్నారు. కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. వెంటనే కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశాడు.

నూతన కార్యవర్గం ఎన్నిక
సిద్దిపేటకమాన్: సిద్దిపేట రూరల్ మండల కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు నూతనంగా ఎన్నికైన వారు తెలిపారు. అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షుడిగా రాంబాబు, కార్యదర్శిగా మల్లేశం, కోశాధికారిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. వీరికి నియామక పత్రాలు అందజేసినట్లు చెప్పారు.

సమస్యలపై చర్చించాలి
కోహెడ(హుస్నాబాద్): అసెంబ్లీ సమావేశాల్లో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై చర్చించి వెంటనే పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతకింది కుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు. నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించపోవడం శోచనీయమన్నారు.

రసాభాసగా గ్రామసభ

- రంగన్నకుంటలో పంచాయతీ భవనం నిర్మించాలని డిమాండ్
- పోలీసుల జోక్యంతో శాంతించిన గ్రామస్తులు


గ్రామస్తులను సముదాయిస్తున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మైసమ్మవాగు తండా గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభ రసవత్తరంగా సాగింది. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఆధ్వర్యంలో సర్పంచ్ లావణ్య అధ్యక్షతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణంపై గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు మైసమ్మవాగు తండా, బండమీదితండా, రంగన్నకుంట, మబ్బుకుంట తండాల గ్రామస్తులు హాజరయ్యారు. సభలో రంగన్నకుంట, మబ్బుకుంట తండా గ్రామస్తులు మైసమ్మవాగుతండా, బండమీదితండా గ్రామస్తుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వావాదం జరిగింది. గ్రామస్తులను పోలీసులు సముదాయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం మేరకు పంచాయతీ భవన నిర్మాణం చేపడతామన్నారు. దీనిపై వారి అభిప్రాయాలను పరిగణనలో తీసుకుంటామన్నారు. ఎక్కువ జనాభా ఉన్న రంగన్నకుంట వద్దే భవన నిర్మాణం చేయాలని తమ అభిప్రాయాలను తెలిపారు. రంగన్నకుంట అన్ని తండాలకు మధ్యలో ఉంటుందని, దాదాపు పదెకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ సంజీవ్‌కుమార్‌కు కలిసి తండావాసులు వినతి పత్రం అందజేశారు.

తహసీల్దార్లుగా బాధ్యతల స్వీకరణ


వెంకట్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి తహసిల్దార్‌గా నల్ల వెంకట్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి తహసీల్దార్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన విజయ ప్రకాశ్‌రావు బదిలీపై రాజన్న సిరిసిల్లా జిల్లా తంగళ్లపల్లికి వెళ్లారు.


సురేఖ

కోహెడ(హుస్నాబాద్): కోహెడ తహసీల్దార్‌గా కొనుకుల సురేఖ బాధ్యతలు స్వీకరించారు. ఈమె కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం తహసీల్దార్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన జావిద్ అహ్మద్ బదిలీపై సిరిసిల్లకు వెళ్లారు. నూతన తహసీల్దార్‌కు డీటీ రాజిరెడ్డి, సిబ్బంది సురేందర్, హరీశ్, లక్ష్మి విద్యుల్లత, బాలకృష్ణ, హరీశ్ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ రోడ్డు మరమ్మతులకు ఆదేశాలు

దుబ్బాక రూరల్: మండలంలోని అచ్చుమాయిపల్లి, కమ్మర్‌పల్లి, పరశురాంనగర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిందని గ్రామస్తులు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి పంచాయతీరాజ్ అధికారులతో ఫోన్లో మాట్లాడి రోడ్డు మరమ్మతులకు ఆదేశించారు. ఎంపీ ఆదేశాల మేరకు అధికారులు రోడ్డు మరమ్మతు లు ప్రారంభించినట్లు శుక్రవారం ఉప సర్పంచ్ దేవరాజ్ తెలిపారు. ఎంపీకి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

◆ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత పుస్తకాలను ప్రిన్సిపాల్ రాజన్న శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలోనే మంచి విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్‌శర్మ, మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని నిర్మల్‌నగర్ గ్రామానికి చెందిన కర్రె యాదగిరి, ఎర్ర నర్సింహులు సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. శుక్రవారం సర్పంచ్ శ్యామల రాజు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. యాదగిరికి రూ.57 వేలు, నర్సింహులుకు రూ.52 వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మర్కూక్(గజ్వేల్): సీఎం సహాయనిధి పేదలకు భరోసా ఇస్తుందని ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.60 వేలు చెక్కు రూపంలో మంజూరైంది. దీనిని శుక్రవారం ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. 8 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.72 లక్షల చెక్కుల రూపంలో విడుదల చేసింది. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామ్‌రెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని తిరుపతి రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

◆ మొక్కల పెంపకం చేపట్టాలి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన హరిత హారం కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ప్రజలు మొక్కలు పెంపకం చేపట్టాలని ఎంపీపీ లకావత్ మానస అన్నారు. శుక్రవారం భల్లునాయక్ తండాలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు ఆహ్లాదకరంగా ఉండాలంటే అందరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇస్లావత్ రజిత, ఉపసర్పంచ్ జవహర్‌లాల్, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణ పరిధిలోని 8వ వార్డు నుంచి 12వ వార్డు వరకు ఇంటింటికి మొక్కలు పంపిణి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, కౌన్సిలర్ ఉడుముల ఇన్నమ్మ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

◆ ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతుల రుణమాఫీ ఏకకాలంలో అమలు చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అజ్జు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పూర్తి రుణ మాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ హయాంలోనే రైతులకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందన్నారు.

◆ స్కూల్ బ్యాగుల పంపిణీ

మిరుదొడ్డి(దుబ్బాక): ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్కూల్ బ్యాగులు, టై బెల్టులు, బ్యాడ్జీలు, సంగీత పరికరాలు, క్రీడా సామగ్రిని బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఎన్ఆర్ఐ ఎర్త్ ఫౌండేషన్ సభ్యురాలు బండారి జ్యోతిర్మయి, డైరెక్టర్లు రాజు, వెన్నెల, కో డైరెక్టర్లు ముద్ర రాజు, ఆంజనేయులు, శ్రావణ్, విజయ్ కుమార్, నాగరత్న, హెచ్ఎం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

◆ నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

హుస్నాబాద్: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ బెన్ షాలోమ్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మామిడి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు వరయోగుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.